సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

గంగవరం పోర్టు నుంచి బిలాస్‌పూర్ స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గులోడుతో వెళ్తున్న గూడ్స్ రైలు పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు తప్పింది. 8లో



అర్జీలకు తక్షణ పరిష్కారం

స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ మల్లికార్జున ఆదేశించారు. స్పందనకు 220 అర్జీలు వచ్చాయి. 8లో



అనాథ పిల్లలకు అండ

ఏ దిక్కులేని పిల్లలకు మిషన్ వాత్సల్య పథకం కింద నెలకు రూ.4వేలు ఆర్థిక సాయం అందించనుంది. 8లో



న్యూస్‌రీల్

గంగవరం పోర్టు సరికొత్త రికార్డు



రికార్డు సాధించిన పోర్టు అధికారుల బృందం

పెదగంట్యాడ : అదానీ గంగవరం పోర్టు గత నెల 31న 663 రేక్‌లను నిర్వహించడంలో సరికొత్త రికార్డు సాధించింది. వివిధ రకాల కార్గోలను నిర్వహించడంలోనూ రికార్డులు సృష్టిస్తోంది. గత జనవరిలో నిర్వహించిన 26 రేక్‌లను అధిగమిస్తూ ఇప్పుడు 32 రేక్‌లను నిర్వహించింది. పోర్టు ఒక్క రోజులో అత్యధికంగా 22 రేక్‌లు లోడ్ చేసి అవుట్ వర్డ్ రేక్‌లను సాధించింది. మార్చి నెలలో పోర్టు అత్యధిక సంఖ్యలో 663 రేక్‌లను నిర్వహించి.. గత జనవరిలో 660 రేక్‌ల నిర్వహణను అధిగమించింది. గత ఫిబ్రవరిలో 230 ఇన్‌వర్డ్ రేక్‌లను నిర్వహించగా మార్చిలో 264 రేక్‌లను నిర్వహించింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో 5,475 రేక్‌లను నిర్వహించగా 2022–23లో 6,238 రేక్‌లను నిర్వహించి రికార్డు సృష్టించింది. 2019–20 సంవత్సరంలో 4,063 అవుట్ వర్డ్ రేక్‌లను నిర్వహించగా 2022–23లో 4,556 అవుట్ వర్డ్ రేక్‌లను నిర్వహించి రికార్డు బ్రేక్ చేసింది.

మెడ్‌టెక్ జోన్‌లో ఆల్ట్రాసౌండ్ డాప్లర్‌పై శిక్షణ



మెడ్‌టెక్‌జోన్, వన్‌లెర్నింగ్ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : ప్రసూతి విభాగ చికిత్సలోని వివిధ దశలపై ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో వన్ లెర్నింగ్ ఏఎంటీజెడ్ అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ముగిశాయి. అల్ట్రాసౌండ్ డాప్లర్, గైనకాలజీ అల్ట్రాసౌండ్, కేస్ డిస్కషన్ తదితర అంశాలపై రెండు రోజుల పాటు నిపుణులైన వైద్యుల పర్యవేక్షణలో శిక్షణ అందించారు. దేశంలోని పలు నగరాల నుంచి వైద్యవిద్యార్థులు, డాక్టర్లు ఈ తరగతులకు హాజరయ్యారు.

అప్పన్న సన్నిధిలో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుంటున్న జస్టిస్ సతీష్‌చంద్రశర్మ

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీష్‌చంద్ర శర్మ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ధ్వజస్తంభం వద్ద అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కనకరాజు అందజేశారు.

క్రెడాయి నూతన కార్యవర్గం





చైర్మన్ కెఎస్‌ఆర్‌కె రాజు, ప్రెసిడెంట్ ధర్మేంద్ర

సీతమ్మధార : క్రెడాయి విశాఖపట్నం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం సీతమ్మధారలోని కేఎస్‌ఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. చైర్మన్‌గా కె.ఎస్.ఆర్.కె.రాజు(సాయి), ప్రెసిడెంట్‌గా వి.ధర్మేంద్ర, వైస్ ప్రెసిడెంట్‌గా ఈ.అశోక్‌కుమార్, సెక్రటరీగా వి.శ్రీను, జాయింట్ సెక్రటరీలుగా కె.శ్రీనివాస్, పి.నర్సింహరావు, కోశాధికారిగా కె.వి.ఆర్.రాజు(రమేష్), కమిటీ మెంబర్‌గా ఎం.కృష్ణమోహన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తొలి రోజు ప్రశాంతం



సంపత్ వినాయక గుడి వద్ద విద్యార్థుల కోలాహలం



గురువుకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థిని

- పదో తరగతి పరీక్షలకు 99.5 శాతం హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్

విశాఖ విద్య: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 136 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 27,987 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 27,855 మంది హాజరయ్యారు. తొలిరోజు తెలుగు పరీక్షకు 99.5 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో ఎల్.చంద్రకళ వెల్లడించారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోమని విద్యాశాఖాధికారులు ముందుగానే పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ముందుగానే చేరుకున్నారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా 8.45 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులను గేటు వద్దనే పూర్తి స్థాయిలో తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు. సచివాలయ మహిళా పోలీసులను కేంద్రాల వద్ద విధుల్లో ఉంచారు. బ్యాగులు, ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించలేదు. ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు.

పరీక్ష కేంద్రాలపై గట్టి నిఘా

మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్ష కేంద్రాలపై గట్టి నిఘా పెట్టారు. స్క్వాడ్ అధికారులు జిల్లాలో 25 కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షల జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. డీఈవో చంద్రకళ ఎనిమిది కేంద్రాలు, జిల్లా పరిశీలకురాలైన ఆర్జేడీ జ్యోతికుమారి మూడు చోట్ల తనిఖీ చేశారు. తొలిరోజు ఎటువంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు. నగరంలోని కేడీపీఎం స్కూల్, కొటక్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాసే గదుల్లోకి వెళ్లి, వారికి ఏర్పాటు చేసిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు.



కేడీపీ స్కూల్‌లో ఓఎంఆర్ షీటును పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద విద్యార్థుల సందడి



బెస్ట్ ఆఫ్ లక్ చెబుతున్న ప్రధానోపాధ్యాయురాలు



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది



బొట్టు పెట్టి ఆశీర్వదించి..



గాయపడిన విద్యార్థికి పోలీసు సాయం

పౌష్టికాహారం మెండుగా..

- కేజీహెచ్‌లో డైట్ చార్జీల పెంపు
- పకడ్బందీగా అమలుకు చర్యలు

మహారాణిపేట: కేజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చే రోగులకు సంతృప్తికరమైన పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందు కోసం డైట్ చార్జీలను ప్రభుత్వం అమాంతం పెంచింది. పెంచిన డైట్ చార్జీలు ఈ నెల ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చాయి. కేజీహెచ్‌లో డెలివరీ అయ్యే గర్భిణులకు ప్రత్యేక మెనూ సిద్ధం చేశారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కోసం గతంలో ఒక్కొక్కరికి రూ.36 చెల్లించేవారు. ఎన్నో ఏళ్లుగా ఇవే చార్జీలు కొనసాగాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత వైద్య, ఆరోగ్య రంగాలకు ఎంతో ప్రాధాన్యమిస్తోంది. ఇందులో భాగంగా రోగుల డైట్ చార్జీలను రూ.80కు పెంచింది. అలాగే డ్యూటీ డాక్టర్లకు భోజనం కోసం ఒక్కొక్కరికి రూ.80 చెల్లిస్తుండగా.. ఆ మొత్తం రూ.100కు పెంచారు. కాగా.. కేజీహెచ్‌లోని మొత్తం 26 వార్డులోని ప్రతి రోజూ 1,200 మంది రోగులు, 56 మంది డ్యూటీ వైద్యులకు డైట్ క్యాంటీన్ నుంచి భోజనం సరఫరా చేస్తున్నారు.

నలుగురు కాంట్రాక్టర్ల ఎంపిక

కేజీహెచ్‌లో రోగులకు, డాక్టర్లకు ప్రతిరోజూ భోజనం సరఫరా చేయడానికి నలుగురు కాంట్రాక్టర్లు ఎస్.శ్రీనివాసరావు, కె.సురేష్, భీరన్న కుట్టి, వై.కోటేశ్వరరావులను ఎంపిక చేశారు. ఒక్కొక్క కాంట్రాక్టర్ ఆరు నెలల చొప్పున నలుగురు రెండేళ్ల పాటు పనిచేస్తారు. ఆ తర్వాత వచ్చే ఏడాదికి ఎవరి పనితీరు బాగుంటే వారికి ఇవ్వాలని నిర్ణయించినట్లు కేజీహెచ్ చీఫ్ డైటీషియన్ హెచ్. వెంకటరమణారావు తెలిపారు.

గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక మెనూ

జననీ శిశు సంరక్షణ కార్యక్రమాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక మెనూ అమలు చేస్తున్నారు. కేజీహెచ్‌లో ప్రసవం కోసం చేరిన గర్భిణులకు ఈ పథకం వర్తిస్తుంది. గతంలో వీరికి రోజుకు రూ.80 చొప్పున భోజనం ఇచ్చేవారు. ఇప్పుడు ఈ మొత్తం రూ.100కు పెంచారు.

రోజు	ఉదయం	మధ్యాహ్నం	సాయంత్రం	రాత్రి
1	రొట్టె, పాలు, బెల్లం	రొట్టె, పాలు, బెల్లం	రాగిమాల్ట్, పప్పు ఉండ	అన్నం, కూర, సాంబారు, మజ్జిగ
2	రొట్టె, ఇడ్లీ	రొట్టె, పాలు, బెల్లం	రాగిమాల్ట్, పండు	అన్నం, కూర, సాంబారు, మజ్జిగ
3	కిచిడీ, చట్నీ	అన్నం, పప్పు, కూర, గుడ్డు పెరుగు, సాంబారు, అరటి పండు	రాగిమాల్ట్, పప్పు ఉండ	అన్నం, కూర, సాంబారు, మజ్జిగ
4	టమటా బాత్, చట్నీ	అన్నం, పప్పు, కూర, గుడ్డు పెరుగు, సాంబారు, అరటి పండు	రాగిమాల్ట్, పండు	అన్నం, కూర, సాంబారు, మజ్జిగ
5	ఇడ్లీ, చట్నీ	అన్నం, పప్పు, కూర, గుడ్డు పెరుగు, సాంబారు, అరటి పండు	రాగిమాల్ట్, పప్పు ఉండ	అన్నం, కూర, సాంబారు, మజ్జిగ
6	కట్టు పొంగలి, చట్నీ	అన్నం, పప్పు, కూర, గుడ్డు పెరుగు, సాంబారు, అరటి పండు	రాగిమాల్ట్, పండు	అన్నం, కూర, సాంబారు, మజ్జిగ
7	కిచిడీ, చట్నీ	అన్నం, పప్పు, కూర, గుడ్డు పెరుగు, సాంబారు, అరటి పండు	రాగిమాల్ట్, పప్పు ఉండ	అన్నం, కూర, సాంబారు, మజ్జిగ



సంతృప్తికరమైన భోజనం



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల ఒకటో తేదీ నుంచి కొత్త కాంట్రాక్టర్లు డైట్ సరఫరా చేస్తున్నారు. రోగులకు నాణ్యమైన ఆహారం అందించడానికి చర్యలు తీసుకున్నాం. డైట్ నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి. డైట్ చార్జీలను ప్రభుత్వం రెట్టింపు చేసింది. అందువల్ల రోగులకు నాణ్యమైన, సంతృప్తికరమైన భోజనం అందుతుంది. – పి.అశోక్ కుమార్, సూపరింటెండెంట్, కేజీహెచ్

సమస్యలుంటే తెలియజేయండి



గతంలో రోజుకు ఒకరి కోసం ప్రభుత్వం రూ.36 చెల్లించేది. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ ధరను రూ.80కు పెంచింది. డైట్ క్యాంటీన్‌లో ప్రతి రోజూ అందుబాటులో ఉంటాను. భోజనంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే నా దృష్టికి తీసుకురండి. – హనుమంతు వెంకట రమణారావు, చీఫ్ డైటీషియన్, కేజీహెచ్

పింఛన్ల పంపిణీ షురూ

- తొలి రోజున 12,345 మందికి అందజేత

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలో పింఛన్ల పంపిణీ మొదలైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఠంఛన్‌గా ఒకటో తేదీన తెల్లవారు జామున లబ్ధిదారులకు పింఛన్ అందేది. అయితే మార్చి 31, ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో లావాదేవీలు అప్‌డేట్ చేసేందుకు బ్యాంకులు, ఏటీఎంల్లో లావాదేవీలను నిలుపుదల చేయాలని ఆర్‌బీఐ ఆదేశాలు జారీ చేసింది. ఏప్రిల్ 2వ తేదీ ఆదివారం కావడంతో బ్యాంకుల నుంచి నగదు డ్రాచేసే వీలులేకుండా పోయింది. 3వ తేదీన జిల్లాకు సంబంధించి పింఛన్ల కోసం మొత్తం రూ.44.76 కోట్లు డ్రా చేయాల్సి ఉండగా.. బ్యాంకుల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రూ.24 కోట్లు మాత్రమే విత్‌డ్రా చేయగలిగారు. వీటిని వివిధ ప్రాంతాల సచివాలయ పరిధిలోని వలంటీర్లకు సాయంత్రం 6 గంటలకు అందేజేశారు. నగదు వచ్చిన వెంటనే వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ ప్రారంభించారు. సోమవారం రాత్రి 8 గంటల వరకు జిల్లా పరిధిలో మొత్తం 12,345 మందికి రూ.3.12 కోట్ల మేర పింఛన్ మొత్తాన్ని పంపిణీ చేశారు. మంగళవారం నుంచి పంపిణీ జోరందుకుంటుందని అధికారులు చెబుతున్నారు.



ఆళ్ల లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శోభాదేవి

నారాయణ స్కూల్ వాచ్‌మన్ పైశాచికం

బాలికపై అత్యాచారయత్నం



వాచ్‌మన్ పోచన్న

కూర్మన్నపాలెం: ఓ ప్రైవేట్ పాఠశాల వాచ్‌మన్ బాలికపై లైంగికదాడికి యత్నించాడు. ఈ ఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే... కూర్మన్నపాలెం నారాయణ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్న బాలిక శనివారం సాయంత్రం తరగతులు ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లేందుకు ఆటో కోసం తోటి స్నేహితులతో ఆడుకుంటూ వేచి ఉంది. అదే స్కూల్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న ఆదిలాబాద్‌కు చెందిన అలకోటి పోచన్న (48) బాలికను మాయమాటలతో స్కూల్‌లో ఉన్న బాత్రూమ్‌లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి ప్రయత్నించాడు. బాలిక గట్టిగా అరవడంతో వాచ్‌మన్ అక్కడి నుంచి పారిపోయాడు. గమనించిన తోటి విద్యార్థులు విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు వివరించారు. బాలిక శరీరంపై గాయాలు ఉండడంతో కోపోద్రిక్తులైన బాలిక తల్లిదండ్రులు వాచ్‌మన్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించారు. కానీ అప్పటికే స్కూల్ మూసివేయడం, తరువాతి రోజు ఆదివారం స్కూల్‌కు సెలవు కావడంతో అతడు దొరకలేదు. సోమవారం స్కూల్ తెరిచిన వెంటనే వాచ్‌మన్‌ను పట్టుకుని దేహశుద్ధి చేశారు. నిందితుడు స్కూల్ వెనుక ప్రాంతంలోనే ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దువ్వాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అప్పన్నకు విశేషంగా తిరువీధి



అప్పన్నకు తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: సింహగిరిపై జరుగుతున్న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం సాయంత్రం మాడ వీధిలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామిని తిరువీధిలో దర్శించుకుని ఆశీస్సులు పొందారు. కాగా కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం విశేష హోమాలు, గ్రామ బలిహరణం చేపట్టారు.

మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి పండిత సదస్యం, సాయంత్రం సర్వజన మహారంజని వాహనంపై తిరువీధి నిర్వహించనున్నారు. మంగళవారం స్వామివారి దర్శనాలు ఉదయం 8 గంటల రాత్రి 7 గంటల వరకే ఉంటాయని అధికారులు తెలిపారు.

పక్కా ప్రణాళికతో చందనోత్సవం

ఈవోకి కలెక్టర్ మల్లికార్జున సూచన

సింహాచలం : అప్పన్న చందనోత్సవాన్ని విజయవంతం చేసేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని సింహాచలం ఈవో వి.త్రినాథరావుకు కలెక్టర్ మల్లికార్జున సూచించారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సోమవారం కలెక్టర్ దర్శించుకున్నారు. కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో కలెక్టర్ పేరిట అర్చకులు పూజలు చేశారు. అనంతరం కలెక్టర్ మల్లికార్జున ఆలయ ఈవో త్రినాథరావుతో భేటీ అయ్యారు. ఈనెల 23న జరగనున్న చందనోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. లక్షలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని, వీఐపీలు, వీవీఐపీల తాకిడి ఎక్కువగా ఉండే నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది చోటుచేసుకున్న కొన్ని ఇబ్బందులపై ఆయన ఈవోతో ప్రస్తావించారు. గత ఏడాది వీఐపీలకు దర్శన టికెట్లు ధరలు పెంచామని, ఈసారి కూడా ఆ పద్ధతే కొనసాగించాలన్నారు. గత ఏడాది సంతకాలు లేకుండానే డూప్లికేట్ టికెట్లు జారీచేశారన్న ఆరోపణలు వచ్చాయని, ఈసారి అలాంటి పరిస్థితి లేకుండా కంప్యూటరైజ్డ్ టికెట్లు అందుబాటులో తీసుకువచ్చేలా ఆలోచన చేయాలన్నారు.



శిఖర దర్శనం చేసుకుంటున్న కలెక్టర్ మల్లికార్జున

ఈ వేసవి మరింత చల్లగా..

- జూలో ప్రత్యేక ఏర్పాట్లు
- చల్లదనంతోపాటు ఆహార నియమాలు
- కంటికి రెప్పలా వన్యప్రాణుల సంరక్షణ

ఆరిలోవ (విశాఖ తూర్పు): ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. జూ పార్కులో వన్యప్రాణులు విలవిల్లాడుతున్నాయి. వన్యప్రాణులతో పాటు సందర్శకులకు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేలా జూ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎండ తీవ్రత నుంచి మూగ జీవాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నీడ, చల్లదనం కల్పిస్తున్నారు. వాటికి తాగడానికి నీటిని అందిస్తున్నారు. ఆహార విషయంలో మార్పులు చేస్తున్నారు. ఆరోగ్యంలో మరింత జాగ్రత్తలు తీసుకొంటున్నారు. జూలో జింకలు, కనుజులు, కోతులు, పులులు, ఎలుగుబంట్లు, సింహాలు, చింపాంజీలు ఎన్‌క్లోజర్లలో తాటాకులు వేస్తున్నారు. ఇప్పటికే వీటి ఎన్‌క్లోజర్లలో స్ప్రింకర్లు అమర్చారు. ఏనుగుల ఎన్‌క్లోజర్‌లో గతంలో వేసిన ఎత్తయిన తాటాకుల పందిరికి మరమ్మతులు చేపట్టి కొత్తగా అవసరమైన చోట్ల కొమ్మలు అమర్చారు. అన్ని వన్యప్రాణుల ఎన్‌క్లోజర్లలో ఉండే నైట్‌క్రాల్స్‌పై చల్లదనం కోసం వైట్ వాష్ వేస్తున్నారు. వాటికి కావాల్సినంత నీటిని అందుబాటులో ఉంచారు. ప్రతి ఎన్‌క్లోజర్‌లోకి పైపుల ద్వారా బోరు, కుళాయి ద్వారా నీటిని అందిస్తున్నారు. వన్యప్రాణులు నీరసించిపోకుండా ఉండడానికి పాలిబియాన్, గ్లూకోజ్ పౌడర్‌ను నీటిలో కలిపి అందిస్తున్నారు. చింపాంజీలకు కొబ్బరి బోండాల నీరు తాగిస్తున్నారు. పక్షుల ఎన్‌క్లోజర్లలో వట్టివేళ్ల చాపలు వేశారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం పక్షులను నీటితో తడుపుతున్నారు.

ఏనుగులు, చింపాంజీలకు ప్రత్యేక చర్యలు

ఏనుగులు, చింపాంజీలకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఏనుగులకు రోజూ స్నానం కోసం, తాగడానికి ఎక్కువ నీరు అవసరమవుతుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని నాలుగేళ్ల క్రితమే ఏనుగుల మోటోలో నీటి తొట్టె నిర్మించారు. ఆ తొట్టెలో అవి స్నానం చేయడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా 10వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. వీటితో పాటు ఇక్కడ ఉన్న రెండు చింపాంజీలకు వాటి నైట్‌క్రాల్స్‌లో చల్లదనం కోసం కూలర్లు ఏర్పాటు చేశారు. వాటికి ప్రత్యేకంగా కొబ్బరి బొండాల నీరు, పాలిబియాన్, గ్లూకోజ్ నీరు వేర్వేరు సమయాలలో అందిస్తున్నారు.

సందర్శకుల కోసం..

జూకు వచ్చే సందర్శకుల కోసం ఆరు చోట్ల ఆర్వో ప్లాంట్లు అందుబాటులో ఉన్నాయి. ముఖం, చేతులు శుభ్రం చేసుకోవడానికి పలుచోట్ల నీటి ట్యాప్‌లు ఏర్పాటు చేశారు. ఏనుగులు, పులులు, ఎలుగుబంట్లు, జింకలు, కణుజులు, జిరాఫీల ఎన్‌క్లోజర్ల వద్ద, పక్షులు, పాములు, కోతులు జోన్ల వద్ద షెడ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని శుభ్రం చేయించారు.



ఆఫ్రికన్ ప్యారెట్స్ జోన్‌లో అమర్చిన కూలింగ్ అద్దాలు



పక్షుల జోన్‌లో గూళ్లుపై వేసిన కస్‌కస్ చాపలు



సందర్శకుల తాగు నీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్

మూడు రోజుల క్రితం ఇక్కడ సందర్శకుల కోసం డైరెక్టర్ జనరల్ ఆఫ్ జీఎస్టీ ఇంటెలిజెన్సీ విశాఖ అధికారులు స్వచ్ఛతా హై సేవా కార్యక్రమంలో భాగంగా జూలో కణుజుల ఎన్‌క్లోజర్ ఎదురుగా ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు.

అన్ని ఎన్‌క్లోజర్లలోనూ సౌకర్యాలు

జూలో అన్ని ఎన్‌క్లోజర్లలోనూ సౌకర్యాలు కల్పించాం. ఇక్కడ 90 రకాల జాతులకు వన్యప్రాణులున్నాయి. అవి ఉండే ఎన్‌క్లోజర్లలో వేసవి చర్యలు చేపడుతున్నాం. వన్యప్రాణులకు రోజూ ఇచ్చే ఆహారంలో మార్పులు చేస్తున్నాం. నీరు అధికంగా సరఫరా చేయడం, తాగు నీటిలో శక్తి కోసం గ్లూకోజ్, ఎలక్ట్రోలైట్స్, పాలిబియాన్ పౌడర్ కలిపి ఇస్తున్నాం. రోజు మాదిరిగా ఇచ్చినదానికంటే నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు ఎక్కువగా అందిస్తున్నాం. జూకు వచ్చే సందర్శకుల కోసం ఇక్కడ ఆరు చోట్ల ఆర్వో ప్లాంట్లు, పలుచోట్ల నీటి ట్యాప్‌లు, విశ్రాంతి కోసం శుభ్రం చేయించిన షెడ్‌లు అందుబాటులో ఉంచాం. – అనంత్ శంకర్, ఇన్‌చార్జి క్యూరేటర్, జూ పార్కు

పోలీస్ స్పందనకు 59 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీపీ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనకు 59 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ (ఎస్‌బీ) గంగాధర్‌తో ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు, ఆక్రమణలపై ఫిర్యాదు

దాబాగార్డెన్స్: దాదాపు రెండు వారాల తర్వాత నిర్వహించిన జీవీఎంసీ స్పందనకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. జీ-20 సదస్సు కారణంగా అధికారులు ఆయా ఏర్పాట్లలో నిమగ్నం కావడంతో గత వారం స్పందన రద్దు చేశారు. సోమవారం నిర్వహించిన స్పందనలో 101 వినతులు వచ్చాయి. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి అక్రమ నిర్మాణాలు, నిబంధనలు ఉల్లంఘించి కట్టడాలు, రోడ్డు ఆక్రమణలు వంటి ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. అలాగే ప్రజారోగ్యానికి, ఇంజినీరింగ్, రెవెన్యూకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ స్పందన కార్యక్రమం నిర్వహించారు. జోన్-1 నుంచి ఒకటి, జోన్-2కు 11, జోన్-3కి 15 , జోన్-4 నుంచి 7, జోన్-5 కు 22, జోన్-6 నుంచి 29, జోన్-8కి ఆరు, ప్రధాన కార్యాలయానికి సంబంధించి పది ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించి 3 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ

కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, డీసీ(రెవెన్యూ) ఫణిరాం, సెక్రటరీ పి.నల్లనయ్య, ఎస్ఏ అండ్ ఏఓ మల్లికాంబ, డీపీఓ చంద్రిక, అసిస్టెంట్ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్, డీసీపీలు, ఏసీపీలు, పర్యవేక్షక ఇంజినీర్లు, యూసీడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు తక్షణ పరిష్కారం



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: స్పందన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు అర్జీదారులు పోటెత్తారు. 220 అర్జీలు స్వీకరించినట్టు కలెక్టర్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్జీలు రీ ఓపెన్ కాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, పోలీస్ అధికారులు , మున్సిపల్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పట్టుకున్నారు.. వదిలేశారు..!

- బాధితురాలికి చుక్కలు చూపిస్తున్న ఫోర్త్ టౌన్ పోలీసులు
- షాపు దోపిడీపై ఆరు నెలలైనా కేసు నమోదు చేయని వైనం



బాధితురాలు వరలక్ష్మి

సీతమ్మధార : 'దొంగతనం జరిగినట్టు నిర్ధారణ అయింది. దొంగలెవరో సీసీ ఫుటేజ్ ద్వారా గుర్తించారు. ఆరుగురిలో ముగ్గుర్ని అదుపులో తీసుకున్నారు. మరేమైందో గానీ నిందితులనూ విడిచిపెట్టేశారు..ఇంతవరకు కేసూ నమోదు చేయలేదు..' అని బాధితురాలు వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేసింది. ఆరు నెలలుగా కాళ్లరిగేలా ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదని, పోలీసు ఉన్నతాధికారులు స్పందించాలని ఆమె వేడుకుంది. బాధితురాలు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. శంగం,శరత్ థియేటర్‌కు ఆనుకుని తన పాన్ షాప్‌లో గత ఏడాది అక్టోబర్ 22వ తేదీ రాత్రి ఒంటిగంట సమయంలో ఆరుగురు యువకులు వచ్చి షాపులో ఉన్న రూ.30 వేలు విలువగల సిగరెట్లు, రూ.10వేలు దోచుకున్నారు. షాపులో దొంగతనం జరిగిందని మరుసటి రోజు గుర్తించి ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశానని లక్ష్మి వెల్లడించింది. దీంతో పోలీసులు సంగం, శరత్ థియేటర్‌లో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించి చోరీకి పాల్పడిన వారిని గుర్తించారని, ఆరుగురిలో ముగ్గురుని అదుపులో తీసుకున్నారన్నారు. అయితే తనకు న్యాయం చేయకపోగా.. నిందితులను విడిచిపెట్టారని ఆరోపించారు. ఇంతవరకు ఫిర్యాదు నమోదు చేయకపోగా తనను ఎస్ఐ ఖగేశ్వరరావు బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఇదిలావుండగా కేసు వ్యవహారం బయటకు రావడంతో ఫోర్త్‌టౌన్ పోలీసులు రాజీ కుదిర్చేందుకుప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఇటీవల ఓ కేసు విషయంలో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదునే మార్చి నేరస్తులకు సహకరించారన్న ఆరోపణలున్నాయి. తాజాగా ఈ సంఘటన కూడా వెలుగులోకి రావడంతో ఫోర్త్‌టౌన్ పోలీసుల వ్యవహారం వివాదాస్పదమవుతోంది.

ఏఆర్ కానిస్టేబుల్ అరెస్టు

అల్లిపురం (విశాఖ దక్షిణ): విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ కండక్టర్‌పై దాడికి పాల్పడిన ఏఆర్ కానిస్టేబుల్‌ను సోమవారం టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టూటౌన్ సీఐ బెండు తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం శనివారం రాత్రి పాడేరు నుంచి విశాఖకు ఆర్టీసీ బస్సు బయలుదేరింది. బస్సు బోడవరం వచ్చిన తరువాత ఏఆర్ కానిస్టేబుల్ ఎ.అప్పలనాయుడు బస్సు ఎక్కాడు. విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ వచ్చిన తరువాత కూడా కానిస్టేబుల్ బస్సు దిగకుండా నిద్రపోతున్నాడు. దీంతో కండక్టర్ రౌతు మురళీకృష్ణ అతనిని నిద్రలేపి కిందకి దిగమన్నాడు. దగ్గరుండి కిందకు దింపిన తరువాత ఏఆర్ కానిస్టేబుల్ అప్పలనాయుడు తిరిగి బస్సులోకి వచ్చి కండక్టర్‌తో వాగ్వాదానికి దిగి అతని ముఖంపై బలంగా దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో కండక్టర్ టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

12న వాహనాలకు ఈ-వేలం

మహారాణిపేట : వైద్య ఆరోగ్యశాఖకు చెందిన 12 వాహనాలను ఈ-వేలం ద్వారా విక్రయించనున్నారు. ఈనెల 12వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటలలోపు వాహనాలను విక్రయించాలని నిర్ణయించినట్టు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఇతర వివరాల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ-వేలం పోర్టల్ https//konugulu.ap.gov.in పరిశీలించాలని, వేలం నిబంధనలు వెబ్‌సైట్‌లో పొందుపరిచామని డీఎంహెచ్‌వో తెలిపారు.

ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్‌కు రమణయ్య

విశాఖ స్పోర్ట్స్ : వరల్డ్ ట్రాన్స్‌ప్లాంట్ గేమ్స్‌లో సీనియర్ సిటిజన్ పీవీ రమణయ్య పాల్గొనున్నారు. నేషనల్ ఫుట్‌బాలర్‌రైన రమణయ్య స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించి ఈకోర్స్ వాల్తేర్ సహాయ కార్యదర్శిగానూ సేవలందించారు. అయితే 2017లో లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేసుకోవడంతో ఫుట్‌బాల్‌కు స్వస్తి పలికి టెన్నిస్ ఆటగాడిగా మారారు. త్వరలో ఆస్ట్రేలియాలో జరగనున్న ఈ గేమ్స్‌లో టెన్నిస్ సింగిల్స్, డబుల్స్‌లో భారత్ జట్టుకు ఆడనున్నారు.

అంధుల కోసం ఆడియో డివైజ్ విడుదల

మహారాణిపేట : అంధ విద్యార్థులు, నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడేలా వారు విని నేర్చుకునేందుకు వీలుగా స్టడీ మెటీరియల్‌ను మెమొరీ కార్డ్‌లో నిక్షిప్తం చేసి ఆడియో డివైజ్‌లను విడుదల చేశారు. ఆడియో డివైజ్ రూపకల్పనకు సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ రూ.7 లక్షలు ఆర్థిక సాయం చేశారు. అంధులు అన్ని రంగాల్లో రాణించేందుకు తమ వంతు ఎప్పుడూ సహాయసహకారాలు అందిస్తామని మావూరి వెంకటరమణ పేర్కొన్నారు. మెటీరియల్ రూపొందించిన జగదీష్ బాబు మాట్లాడుతూ అంధుల అభ్యున్నతికి వెంకటరమణ ముందుకు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న అంధులందరికీ ఈ డివైజ్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.



ఆడియో డివైజ్‌ను విడుదల చేస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ

ఇండియన్ బ్యాంక్ నూతన శాఖ ప్రారంభం

బీచ్‌రోడ్డు : ఇండియన్ బ్యాంక్ 47వ బ్రాంచ్‌ను సిరిపురంలో సోమవారం చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఎస్.సుధాకర్ ప్రారంభించారు. ఈ శాఖ ప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. తమ బ్యాంక్ పది లక్షల కోట్ల వ్యాపారాన్ని అధిగమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ అత్యుత్తమ ఖాతాదారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్ వెంకట రమణరావు మాట్లాడుతూ విశాఖపట్నం జోన్ పరిధిలో ఆరు జిల్లాలు ఉన్నాయన్నారు. ఈ జోన్‌లో ఇప్పటివరకు 46 శాఖలతో రు.6,800 కోట్ల వ్యాపారం నిర్వహించినట్లు తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రు.200 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. వ్యవసాయంపై రూ.175 కోట్లు, మహిళ గ్రూపులకు రు.150 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు యూవీ సుబ్బారావు, ప్రభంజన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న సుధాకర్

వేసవి క్రీడా శిబిరాల ప్రారంభం



క్రీడా శిబిరాలు ప్రారంభించిన డీఆర్ఎం

విశాఖ స్పోర్ట్స్ : ఈకోర్స్ వాల్తేర్ డివిజన్ ఆధ్వర్యంలో వేసవి క్రీడా శిబిరాలను డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పత్తి సోమవారం ప్రారంభించారు. మే నెలాఖరు వరకు పలు క్రీడాంశాల్లో శిబిరాలు నిర్వహించనున్నారు. 5 నుంచి 15 ఏళ్ల చిన్నారులకు అథ్లెటిక్స్‌తో పాటు బాక్సింగ్, బాస్కెట్‌బాల్, క్రికెట్, బాల్‌బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, స్కేటింగ్, స్విమ్మింగ్, టీటీ, టెన్నిస్, వాలీబాల్ క్రీడల్లో శిక్షణ పొందనున్నారు. రైల్వే ఇండోర్ స్పోర్ట్స్ ఎన్‌క్లేవ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్, క్రీడాధికారి ప్రవీణ్‌భాటి, సహాయ క్రీడాధికారి అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పరీక్షల్లో ఇద్దరు డిబార్

విశాఖ విద్య: సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో తొలిరోజే ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. సోమవారం పరీక్షలు ప్రారంభం కాగా, పదో తరగతికి సంబంధించి 827 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 756 మంది హాజరయ్యారు. అదే విధంగా ఇంటర్మీడియెట్ కోర్సుకు 782 మంది విద్యార్థులకు గాను 709 మంది హాజరయ్యారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన పెందుర్తి, మాధవధార కేంద్రాల్లో ఇద్దరు విద్యార్థులను డిబార్ చేశారు.

'ఓపెన్'లో అవస్థలు

సోమవారం మధ్యాహ్నం జరిగిన సార్వత్రిక విద్యాపీఠం(ఓపెన్) టెన్త్, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో కొన్ని చోట్ల విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. నగరంలోని ఓ ప్రైవేటు కాలేజీ సెంటర్ నుంచి అడ్మిషన్లు పొందిన వారికి ఆదివారం సాయంత్రం హాల్ టికెట్లు ఇవ్వటంతో, తమకు కేటాయించిన కేంద్రం ఎక్కడ ఉందనేది ముందుగా చూసుకునే అవకాశం లేకుండా పోయింది. మాధవధార కేంద్రంలో పరీక్ష రాయాల్సిన విద్యార్థుల్లో చాలా మంది మధురవాడకు వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి మాధవధారకు చేరుకోవటంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తమ పిల్లలకు పరీక్ష కేంద్రం ఎక్కడ వచ్చిందో కూడా కాలేజీ వారు చెప్పలేదని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)	
బ్రాయిలర్ (లైవ్)	: రూ.95
స్కిన్	: రూ.160
స్కిన్‌లెస్	: రూ.170

కోడిగుడ్ల ధరలు



రూ.లలో (వందకు)	
విశాఖ	430.00
విజయనగరం	434.00
శ్రీకాకుళం	434.00

పటిష్టంగా బాలల హక్కుల పరిరక్షణ

ఆరిలోవ(విశాఖ తూర్పు): బాలల హక్కుల పరిరక్షణకు అందరూ బాధ్యతగా కృషి చేయాలని జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు డాక్టర్ ఆర్.జి. ఆనంద్ తెలిపారు. ఆరిలోవ ప్రాంతం దీన్‌దయాల్‌పురంలో ఉన్న ప్రభుత్వ బాలుర అబ్జర్వేషన్ గృహం, డెయిరీఫారం దరి రూరల్ తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలికల గృహాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఆయా గృహాలలో ఎంతమంది బాలురు, బాలికలు ఉన్నారో పర్యవేక్షణాధికారులను అడిగి తెలుసుకొన్నారు. మౌలిక సదుపాయాలు, విద్య, ఆహారం, వసతి, ఆరోగ్యం తదితర వాటిపై ఆరా తీశారు. బాలలను ప్రేమతో చూడాలన్నారు. బాలల హక్కులకు ఎవరూ భంగం కలిగించకూడదన్నారు. కార్యక్రమంలో జిల్లా మాతా శిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి, ఆర్డీవో భాస్కరరెడ్డి, రూరల్ తహసీల్దార్ రమణయ్య, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ ఆనంద్

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్ పెట్టెలు

సింహాచలం: పెందుర్తి రైల్వే స్టేషన్ వద్ద గూడ్స్ రైలు సోమవారం పట్టాలు తప్పింది. గంగవరం పోర్టు నుంచి బిలాస్‌పూర్ స్టీల్‌ప్లాంట్‌కు బొగ్గులోడుతో గూడ్స్ రైలు వెళ్తోంది. పెందుర్తి రైల్వేస్టేషన్ సమీపంలో సైడింగ్ లైన్‌లో వెళ్తున్న గూడ్స్‌లోని ఐదు పెట్టెలు పట్టాలు తప్పాయి. వెంటనే లోకోపైలట్ అప్రమత్తమై గూడ్స్ రైలును నిలిపివేశాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న రైల్వే అసిస్టెంట్ డీఆర్ఎం మనోజ్‌కుమార్ యుద్ధప్రాతిపదికన ట్రాక్ పునరుద్ధరించే పనులు చేపట్టారు.

ఆలస్యంగా టెన్త్ ప్రశ్నాపత్రం

గాజువాక : గాజువాక హైస్కూల్‌లోని బీ పరీక్ష కేంద్రంలో పదో తరగతి పరీక్షకు హాజరైన విద్యార్థులకు ప్రశ్నాపత్రం ఆలస్యంగా అందడంపై కలకలం చోటుచేసుకుంది. ఉదయం 9.30 గంటలకు ఇవ్వాల్సిన ప్రశ్నాపత్రాన్ని 10 గంటల తరువాత ఇచ్చినట్టు విద్యార్థులు చెబుతున్నారు. జవాబు పత్రాలను మాత్రం సకాలంలో తీసుకున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న పరీక్షల్లో ఒక సబ్జెక్టుకు ఒకే పేపర్ రాయాల్సి ఉంటుంది. ఆలస్యమైన కారణంగా కొంతమంది విద్యార్థులు వెనకబడినట్టు తెలుస్తోంది.

ఈ విషయంపై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉపాధ్యాయులను నిలదీసినట్టు సమాచారం. పరీక్ష పత్రాలను గుర్తించడంలో కొంత ఆలస్యం జరిగిందని, ఈ కారణంగా ఐదు, పది నిమిషాలు ఆలస్యం చోటు చేసుకుందని విద్యాశాఖాధికారులు అంటున్నారు. మూడు కోడ్‌లలో ప్రశ్నాపత్రాలు వచ్చాయని, వాటిని గుర్తించడంలో సంబంధిత పర్యవేక్షకుడు గందరగోళానికి గురి కావడంతో కొద్దిపాటి ఆలస్యం జరిగిందని గాజువాక మండల విద్యాశాఖాధికారి నాయుడు తెలిపారు.

'నాసా' పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాఖ విద్య: అమెరికా నాసా ఆధ్వర్యంలో స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్-2023 పేరిట అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విశాఖ రీజియన్‌కు చెందిన శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా 139 ప్రాజెక్టులలో భారతదేశం నుంచి 89 ఎంపికవ్వగా, ఇందులో శ్రీ చైతన్య స్కూల్ నుంచి 54 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని విద్యా సంస్థల డైరెక్టర్ సీమ తెలిపారు. విశాఖలోని ఆశీలమెట్ట-1, ఎంవీపీ కాలనీ బ్రాంచ్‌ల నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపియ్యాయని ఏజీఎం ఎం.వి.సురేష్ తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కంచరపాలెం: నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ కంచరపాలెం ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జూలై 1 నుంచి ఎస్టీ/ఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోర్సులను ప్రారంభించనున్నట్లు ఎస్టీ/ఎస్సీ సబ్ రీజినల్ ఎంప్లాయిమెంట్ అధికారి నిట్టల శ్యామ్ సుందర్ తెలిపారు. పోటీ పరీక్షల కోసం ప్రత్యేక కోచింగ్ స్కీమ్, కంప్యూటర్ శిక్షణ, హార్డ్‌వేర్, ఆఫీస్ ఆటోమేషన్, అకౌంటింగ్, పంబ్లింగ్ అసిస్టెంట్, బిజినెస్ అకౌంటింగ్ కోర్సుల్లో 6 నెలల నుంచి ఏడాది పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణా కాలంలో ప్రతి ట్రైనీకి నెలకు రూ.1000, పాఠ్యపుస్తకాలు, ఉచితంగా అందిస్తారు. వార్షిక ఆదాయం ఏడాదికి రూ.3లక్షలు మించరాదు. ఈ నెల 30లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 87001 57960 నంబర్‌లో సంప్రదించాలన్నారు.